విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

డీఎస్పీ చొరవతో తాత్కాలికంగా గ్రామస్తుల ఆందోళన విరమణ

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం యస్ యానాం గ్రామం వద్ద వేదాంత కంపెనీకు చెందిన రోజు వారి కార్యకలాపాలను అడ్డుకొని వారి ఉద్యోగులను విధి నిర్వహణలకు వెళ్ళనివ్వ కుండా నిరోధించిన వారిపై ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. జిల్లా ఎస్పీ ఎస్. శ్రీధర్ సూచనతో శనివారం రాత్రి వేదాంత కంపెనీ సమీపంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో అమలాపురం రూరల్ సిఐ పి.వీరబాబు, ఉప్పలగుప్తం ఎస్సై కేయం జోషిలతో కలిసి అమలాపురం డిఎస్పీ ఎమ్ అంబికాప్రసాద్ చర్చలు జరిపారు. గ్రామస్తుల సమస్యల గురించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని మంత్రి విశ్వరూప్ నేతృత్వంలో వేదాంత కంపెనీ అధీకృత అధికారులతో ఈనెల 13వ తేదీన సమావేశాన్ని ఏర్పాటు చేసిన విషయం గురించి వారందరికీ వివరించారు. ఈ సందర్భంగా ఏలూరు పర్యటనలో ఉన్న మంత్రి విశ్వరూప్‌తో వారు ఫోన్లో మాట్లాడడంతో వారికి ఈ విషయంపై ఆయన భరోసా ఇచ్చారు. ఈనెల 13వ తేదీన జరగబోవు సమావేశంలో వేదాంత కంపెనీ తరఫున సంబంధిత హెచ్‌ఆర్ మేనేజర్ సిఎస్ఆర్ హెడ్‌లు హాజరవుతారని అమలాపురం ఆర్డీవో జీ కేశవర్ధన్ రెడ్డి వారికి ఫోన్లో వివరించారు. శాంతి భద్రతల నిర్వహణలో అందరూ సహకరించవలసిందిగా డిఎస్పీ కోరడంతో గ్రామస్తులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని వర్గాల పెద్దలు పాల్గొన్నారు.

వేదాంత కంపెనీ ఎదుట రెండవ రోజు దీక్ష

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం, యస్ యానాం గ్రామంలో రెండవ రోజు ఆందోళన కొనసాగిస్తున్న గ్రామస్తులు, నిరుద్యోగ యువత. గ్రామ అభివృద్ధి చెయ్యడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని వేదంతా కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.2.5 కోట్లతో రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - జగ్గంపేట : రూ.2.5 కోట్లతో నిర్మాణం చేసే రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే చంటి బాబు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఒక్కసారిగా నియోజకవర్గంలో ఆయన ప్రత్యక్షమయ్యారు. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా తోట నరసింహంను నియమించడంతో సుమారు నెలరోజుల పైబడి ఆయన దూరంగా ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలు నేపథ్యంతో చంటిబాబు మరలా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలో నూతనంగా నిర్మించిన అర్బికేను ఆదివారం ప్రారంభించారు రామవరం, మర్రిపాక, ఇర్రిపాక గ్రామాలను కలిపే రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ రామవరం నుండి ఇర్రిపాక వరకు 6 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేసేందుకు రూ.2.5 కోట్లు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఇర్రిపాకలో నూతన సచివాలయాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్ అండ్ బి డిఈ గణేశ్వరరావు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఇర్రిపాక సర్పంచ్ తిర్రి దేవి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, వైసిపి నాయకులు వంటిపల్లి రామన్న దొర, జ్యోతుల రామస్వామి, వత్సవాయ సత్యనారాయణ రాజు, గణేశుల లక్ష్మణరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమిని గెలిపించండి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : జనసేన, టిడిపి కూటమిలో భాగంగా గ్రామాలలో పర్యటించేందుకు జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్ ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొని ఉప్పాడ, కొత్తపల్లి మండలం కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఎండపల్లి, ఉప్పాడ గ్రామాల్లో పర్యటించి టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని జన సైనికులు ఇంటింటికి వెళ్లి ఓట్లేయాలని అభ్యర్ధించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్, మచ్చ అప్పాజీ మాట్లాడుతూ, అవినీతి పాలన అంతమొందించి, రాష్ట్రాన్ని అప్పులపాలు నుంచి అభివృద్ధి దిశగా పయనించలంటే, ఉద్యోగులకు న్యాయం జరగాలంటే, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలంటే పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిగా రావాలని సూచించారు. జనసేన యూత్ సభ్యులు స్వచ్ఛందంగా కార్యక్రమం నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. పిఠాపురం నియోజకవర్గం లో జనసేన పార్టీ తొలి ఎన్నికల ప్రచారంగా చెప్పుకోవచ్చు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింట ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో గవర రాంబాబు మామిడి మల్లి బాబు, మేడిది రమేష్ పలు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి సంక్షేమం మహిళల పేరు మీదనే

విశాలాంధ్ర - చాగల్లు : రాష్ట్రంలో ప్రతి సంక్షేమ కార్యక్రమం మహిళల పేరు మీదనే ఇస్తున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని గోపాలపురం శాసనసభ్యులు, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక తెలగా సంఘం ఆడిటోరియం ఆవరణలో జరిగిన చాగల్లు మండలం నాలుగో విడత వైయస్సార్ ఆసరా సంబరాల్లో ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ చాగల్లు మండలంలో 1234 గ్రూపులకు గాను 12365 మంది డ్వాక్రా మహిళలకు 11 కోట్ల 13 లక్షల 70,వేల354 రూపాయలు చెక్కును అందజేశారు. మొత్తం నాలుగు విడతల్లో చాగల్లు మండలానికి 44 కోట్ల 52 లక్షల 61 వేల 509 రూపాయలను కేవలం డ్వాక్రా మహిళలకు వైయస్సార్ ఆసరా పథకం కింద ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చాగల్లు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లింకుల దుర్గా మల్లేశ్వర రావు, ఎంపీపీ మట్టా వీరస్వామి, గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైయస్సార్ పార్టీ నాయకులు గండ్రోతు సురేంద్ర, గారపాటి శ్రీనివాస్, ఆత్కూరి దొరయ్య, సుంకర రాయుడు, పొన్నాడ సింహాద్రి, జట్టా ఏడుకొండలు, వేల సంఖ్యలో డ్వాక్రా మహిళలు, వైయస్సార్ పార్టీ కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల మహాసభలకు తరలివెళ్ళిన పీఎంపీలు

విశాలాంధ్ర - మండపేట : విజయవాడలో గ్రామీణ వైద్యుల రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి. ఈ సభలకు మండపేట నుంచి పీఎంపీ ఆదివారం ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. గ్రామీణ వైద్యుల ప్రభుత్వ గుర్తింపునకు సమైక్యతను చాటాలని అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో విజయవాడ తాడిగడప కామినేని ఆసుపత్రి రోడ్డులో ఉన్న అనుమోలు గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి మండపేట టౌన్ హాల్ వద్ద నుండి నాలుగు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూరంపూడి వీరభద్రరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బల్లా వెంకటరమణ, జిల్లా కోశాధికారి మట్టా రాంబాబు, మండపేట మండల కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వానపల్లి కనకరాజు, ఆలమూరు మండల కన్వీనర్ యేడిద లక్ష్మణా చార్యులు, మేకా రామకృష్ణ, ఇందన వేంకటేశ్వరరావు, పిల్లా సతీష్ అధిక సంఖ్యలో పీఎంపీలు వున్నారు.

వేసవి దృష్ట్యా ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

విశాలాంధ్ర - కాకినాడ : రానున్న వేసవి మాసాలలో సాగు, తాగునీటికి రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా పటిష్టమైన ముందస్తు కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార సంబంధాలు, సినిమాటోగ్రఫీ మంత్రి శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణు గోపాలకృష్ణ అధికారులను కోరారు. ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జడ్పీ సమావేశ మంది రంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపీ వంగా గీత, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృత్తికా శుక్లా అతిధులుగా హాజరయ్యారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సమావేశాన్ని ప్రారంభిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లా ప్రగతి సాధన అంశాలలో చైతన్యవంతమైన కృషి చేస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ పాలకమండలి రెండున్నర సంవత్సరాల కాలం విజయవంతంగా పూర్తి చేసుకుందని, ఇందుకు అన్ని విధాల కృషి చేసిన సభ్యులు, సహకరించిన అధికారులు అందరికీ ఆయన ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం 2023-24 సంవత్సరానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సవరణ బడ్జెట్‌ను, 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతి పాదనలను సభ ముందు ఉంచాలని ఆయన జడ్పీ సీఈఓను కోరారు. ఈ మేరకు వివిధ పద్దుల క్రింద 883.34 కోట్లు ఆదాయం, 882.79 కోట్ల వ్యయం అంచనా లుగా 55 లక్షల మిగులుతో ప్రస్తుత 2023-24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలను, 886.95 కోట్లు ఆదాయం, 886.33 కోట్ల వ్యయం అంచనా లతో రానున్న 2024-25 సంవత్సరానికి 62 లక్షల మిగులుతో అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను జడ్పీ సీఈవో ఏ శ్రీరామచంద్ర మూర్తి పద్దుల వారిగా సమగ్రంగా వివరించి చర్చ, ఆమోదం కొరకు సభ ముందు ఉంచారు.

వివిధ అంశాల కింద ప్రతిపాదించిన కేటాయింపుల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సభ ఈ ప్రతిపాదనలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం సమావేశంలో చేపట్టిన అజెండా సమీక్షలో తొలుత చేపట్టిన గ్రామీణ నీటి సరఫరా అంశం క్రింద రానున్న వేసవి మాసాల్లో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టిన ముందస్తు కార్యాచరణ చర్యల గురించి వివరించాలని సభ్యులు అధికారులను కోరారు. మూడు జిల్లాల పరిధిలోని అన్ని సమ్మర్ స్టోరేజి ట్యాంకులను మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు చేపడతామని, బోరు బావుల ముందస్తు ఫ్లషింగ్ నిర్వహిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సభ్యులు వివరించారు. జల జీవన్ మిషన్ క్రింద చేపట్టిన పనులను సంబంధిత కాంట్రాక్టర్లు నిర్దిష్ట కాల పరిధిలో సకాలంలో పూర్తిచేసేలా ఆదేశాలు జారీ చేయాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అధికారులను కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ సమీక్షలో రబీ పంటలకు అవసరమైన ఎరువులు, అపరాల పంటలకు అవసరమైన విత్తనాలకు ఇటువంటి కొరతలేదని అధికారులు వివరించారు. గోదావరి కాలువల వ్యవస్థ క్రింద తాళ్లరేవు, కాజులూరు మండలాల్లోని శివారు భూములకు, ఏలేరు వ్యవస్థలో శివారున ఉన్న పిఠాపురం ప్రాంత భూములకు సాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీ వంగా గీత, పలువురు జడ్పీటిసి సభ్యులు కోరారు. రబీ పంటలకు సాగునీటి సమస్య తలెత్తకుండా వ్యవసాయ ఇరిగేషన్ శాఖల సమన్వయంతో వంతుల వారి విధానాన్ని అమలుపరుస్తున్నామని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల సభ్యులకు తెలియజేశారు. తదుపరి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలో అమలవుతున్న పనులు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల ద్వారా చేపట్టిన పనులు ప్రగతిని సభ సమీక్షించింది. విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ పాఠశాలలకు విలువైన కంప్యూటర్లు, అత్యాధునిక బోధన పరికరాలు ప్రభుత్వం సమకూర్చుతోందని, వీటి భద్రతకు పాఠశాలలో నైట్ వాచ్ మెన్ నియమించాలని సభ్యులు సూచించారు.

సమావేశంలో మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ తాను, ఎంపీ వంగా గీతలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లా ప్రజా పరిషత్ వేదికగానే ప్రజాసేవలో ఉన్నత పదవులు అందుకున్నామని, తమ లాగే ప్రస్తుత పాలకమండలి లోని సభ్యులు అందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమావేశంలో సభ్యులు సూచించిన అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, బిఆర్ అంబేద్కర్-కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ నూపూర్ అజయ్, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ తేజ భరత్, జెడ్పి వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, జడ్పిటిసిలు ఎంపీపీలు ఆప్షన్స్ సభ్యులు పాల్గొన్నారు.

సెస్ నిధులు కార్మికులకే ఖర్చు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : ది కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (భవన నిర్మాణ కార్మిక సంఘం) నెలవారి సమావేశం కాకినాడలో ఆదివారం ఉదయం స్థానిక వీర్ కమల్ థియేటర్ వద్ద పిజిఆర్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ది కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు భద్రత కరువైందని, ఉపాధి లేకుండా పోతుందని, భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదాలకు గురై కాలు విరిగిన, చేయి విరిగిన, సాధారణ మరణం సంభవించిన, యాక్సిడెంట్ అయిన ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ కార్మికుల కొరకై ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పడిందని, ఈ సంక్షేమ బోర్డు ఏర్పడుటకు అనేక సంవత్సరాల పోరాటం ఉందని, మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 2009లో సంక్షేమ బోర్డు అమల్లోకి వచ్చిందని, ఆ సంక్షేమ బోర్డుకు కోట్లాది రూపాయల నిధులు సెస్ రూపంలో వసూలు చేస్తున్నారని, ఆ సెస్ నిధులు ఒక్క రూపాయి కూడా భవన నిర్మాణ కార్మికులకు ఖర్చు చేయడం లేదన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మ్యారేజ్ గిఫ్ట్, డెలివరీ, సాధారణ మరణం, యాక్సిడెంట్, హాస్పట లైజేషన్ తదితర క్లెయిమ్స్ సుమా రుగా ఐదు కోట్ల రూపాయల నిధులు పెండింగ్లో ఉన్నాయని, అవి తక్షణమే మంజూరు చేయాలని ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 2024 ఎన్నికల్లోపు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగించి, అమలు చేయాలని అన్నారు. ఈనెల 7వ తేదీన భవన నిర్మాణ కార్మికుల, ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశాలు జిల్లా సమావేశాలు సామర్లకోటలో జరగనున్నాయని, ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని ప్రసాద్ అన్నారు.

ఈ కార్యక్ర మంలో టీ. అన్నవరం, శ్రీను, పి శివ, అచ్చారావు, కుమార్, ఆర్టిస్టులు సంఘం అధ్యక్షులు ఉల్లి శెట్టి విజయభాస్కర్, బందారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై వినతి పత్రాలు

విశాలాంధ్ర - కాకినాడ : ఎస్‌టియు రాష్ట్ర సంఘం పిలుపుమేరకు 4వ తేదీన ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలు, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయా లని, జిఒ 117 రద్దు, 12వ పిఆర్‌సి అమలు ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ నిబంధనలు రూపొందించి బదిలీలు పదోన్నతులు చేపట్టాలని ఎస్‌టియు నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చమని, వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు & కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు, తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్‌కి, భారతీయ జనతా పార్టీ కాకినాడ నగర శాఖ అధ్యక్షులు గట్టి సత్యనారాయణకి, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాతం మధుకి, ఆప్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్వీఎస్ రామారావుకి వినతి పత్రాలు ఎస్‌టియు కాకినాడ జిల్లా శాఖ పక్షాన అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కుసుమంచి కాశీ విశ్వనాథ్, ఆర్థిక కార్యదర్శి శేశెట్టి సత్యనారా యణ, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు ఎన్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ డివిఎస్ రాజు, పాము శ్రీనివాసరావు, డి కిరణ్మయి, ఎస్‌టియు విద్యా భవన్ సెక్రెటరీ పి రామకృష్ణ, జిల్లా అదనప కార్యదర్శి పి. రామకృష్ణ కాకినాడ టౌన్ అధ్యక్షులు. భయ్యా మహేష్ తదితరులు పాల్గొన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కుసుమంచి కాశీ విశ్వనాథ్, శేశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - రావులపాలెం : ఈతకోట గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారం భించారు. రూ. 15 లక్షలతో నూతనంగా నిర్మించిన "బీసీ గౌడ కమ్యూనిటీ హాల్"ప్రారంభించి గతంలో గౌడన్నలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం అని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం రూ.25 లక్షలతో నిర్మించిన సచివాల యం-1 నూతన భవనం, 43 లక్షల రూపాయలతో సచివాలయం 2 భవనం, 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. కొత్తపేట గ్రామ శివారు పెదగూళ్ళపాలెం నందు రామాలయం ముందు 10 లక్షల రూపాయలతో నిర్మించిన షెడ్డును, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. చినగూళ్ళపాలెంలో ఒక కోటి 90 లక్షల రూపాయలతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు.

ఎమ్మెల్యే కృషితో 7 నుంచి రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి మండలం పరిధిలోని సుమారు 1055 ఎకరాలు గ్రామ కంఠం, అభివృద్ధి చెందిన గ్రామ కంఠం భూములు ప్రభుత్వ పోరంబోకు భూములుగా 22 ఏ పరిధిలోకి తీసుకురావడంతో ఇళ్ళ,స్థలాలు, భూములు రిజిస్ట్రేషన్లు చేయడం ఆగిపోగా ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. రీసర్వేలో 22 ఏ పరిధిలోకి మండలంలోని అనపర్తి, పొలమూరు, రామవరం, కుతుకులూరు, పెడపర్తి, పులగుర్త, దుప్పలపూడి, మహేంద్రవాడ,కొప్పవరం గ్రామాల్లోని సుమారు 1055 ఎకరాలు రావడం జరిగింది.దీంతో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో కలెక్టర్ డాక్టర్ కె మాధవి లత పైన పేర్కొన్న తొమ్మిది గ్రామాల్లోని 1055 ఎకరాలకు సంబంధించి సర్వే నంబర్లోని రిజిస్ట్రేషన్లు యధావిధిగా నిర్వహించాలని రిజిస్ట్రార్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈనెల 7వ తేదీ నుండి రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగుతాయని ఎమ్మెల్యే కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

విశాలాంధ్ర - మండపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా రావాలన్న విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేరాలన్న ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు స్పష్టం చేశారు. ఆదివారం ఏడిద రోడ్డులో ఉన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటి నుంచి మన రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తెస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు వైయస్ జగన్‌లతో పాటు పవన్ కళ్యాణ్ కూడా పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో బీజేపీ కూడా నమ్మించి మోసగించిందన్నారు. ప్రత్యేక హెూదా కోసం మన రాష్ట్రంలోని అగ్ర నాయకులంతా ఢిల్లీ వెళ్లి ధర్నాను విజయవంతం చేసిన ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్, పార్లమెంటు సభ్యుడు మాణిక్యం ఠాగూర్, సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్ రఘువీరా రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, జేడీ శీలం, కొప్పుల రాజు, తులసి రెడ్డి, గిడుగు రుద్రరాజులకు ఈ సందర్భంగా కామన కృతజ్ఞతలు తెలియజేశారు.

తహశీల్దారు ముక్తేశ్వరరావుకు ఘన సత్కారం

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు తహశీల్దార్‌గా పనిచేసి బదిలీపై తణుకు వెళ్తున్న బి.ముక్తేశ్వర రావుకు ఘనంగా సత్కారం చేశారు. రాజోలు మండల విఆర్వోల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ ముక్తేశ్వర రావు, దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వీఆర్వోలు మాట్లాడుతూ తహశీల్దార్ ముక్తేశ్వరరావు వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేశారని అన్నారు. నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసేందుకు రైతులను ఒప్పించి అతి తక్కువ ధరకే అత్యంత విలువైన భూములను సేకరించి పేదలకు పంచారని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించి కరోనా నివారణకు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, విఆర్వోల సంఘం అధ్యక్షుడు అన్నపూర్ణారావు, కెవివి సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, కె మాధవరావు, పి సత్యనారాయణ, బాలాజీ, విఆర్ఎలు కలిగితి నాగేశ్వరరావు, సర్వేర్‌లు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారాగారాన్ని సందర్శించిన సీనియర్ జడ్జి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశ పెట్టిన "యువతను పునరుద్ధరించడం" పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కారాగారంలోని ఖైదీలతో మాట్లాడారు. వారిలో నేరం జరిగిన సమయానికి 18 సంవత్సరాల వయస్సు దాటని వారిని (చట్టంతో విబేధించిన బాల, బాలికలను) గుర్తించి, వారు తమ వయస్సును ఋజువు చేసుకొనేందుకు సంబంధిత న్యాయ స్థానాలలో అర్జీ వేసుకొనేందుకు మరియు ఈ విషయంలో అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాలో దేవరపల్లి క్రీడాకారులకు ప్రథమస్థానం

విశాలాంధ్ర- దేవరపల్లి: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండల క్రీడాకారులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు దేవరపల్లి గ్రామ కార్యదర్శి నెట్ట రవి కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు నైపుణ్యం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో దేవరపల్లి వన్ సచివాలయం మహిళ క్రికెట్ క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. ఖోఖో క్రీడకు సంబంధించి ఎర్నగూడెం సచివాలయం టు పురుషుల జట్టు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. వీరు ఇరువురు జిల్లా స్థాయిలో రాజమహేంద్రవరంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీలలో గోపాలపురం అసెంబ్లీ నుంచి పాల్గొన్నటువంటి దేవరపల్లి సచివాలయం మహిళా క్రికెట్ జట్టు మరియు ఎర్నగూడెం కోకో జట్టు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయిలో విశాఖపట్నంలో ఈనెల 9వ తేదీ నుండి జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె వెంకటరావు చెప్పారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఉచిత వైద్య శిబిరంలో 308 మందికి పరీక్షలు

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్త మండలం సరిపల్లిలో గ్రామ సర్పంచ్ గెద్దం స్వరూప సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం శ్రీహర్ష హాస్పిటల్, అనిల్ ఆర్థో అండ్ ప్లాస్టిక్ సర్జరీ హాస్పటల్‌చే నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో 308 మందికి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీహరి రాయలు, వెన్నా డాక్టర్ పావని, శిరగం డాక్టర్ నీలిమ, చొల్లంగి డాక్టర్ అనిల్ కుమార్, చొల్లంగి స్థానికులు డి. సత్యనారాయణ రాజు, జి. బుజ్జయ్య, పి. వెంకటేష్, సిహెచ్ శ్రీను, కె. బుజ్జి, ఈ ఉచిత వైద్య సేవలు అందించిన డాక్టర్లుకు సర్పంచ్ స్వరూప సురేష్ బాబు, చేతుల మీదుగా దుశ్శాలువాలతో సత్కరించినట్టు తెలిపారు.

ఘనంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

విశాలాంధ్ర - సామర్లకోట : శ్రీ భీమేశ్వర రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలను గున్నం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామర్లకోట రైల్వే గేటు వద్ద ఉన్న ఉండూరు వెళ్లే ఎస్ఎఫ్‌సిఎల్ రోడ్లో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 40 జతలు పైబడి పోటీలో పాల్గొనగా సీనియర్ విభాగంలో మూడు ప్రైజులు జూనియర్ విభాగంలో 5 ప్రైజులు అందించారు పోటీలో పాల్గొన్న ప్రతి ఎట్లుజతకు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో నిర్వాహకులు కొండపల్లి శ్రీను, బిక్కిన రంగనాయకులు, రామకృష్ణ, కాటూరి జానకిరామయ్య, గోలి దొరబాబు తదితరులు నిర్వహించగా ముఖ్య అతిథులుగా డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, చందలాడ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాలు కోరుతూ టిడిపి, జనసేన నిరసన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : శిథిలావస్థకు చేరుకున్న రోడ్ల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని కోరుతూ టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో తూర్పు లక్ష్మీపురం అడ్డ రోడ్డు నుండి రమణయ్య పేట వరకు నాలుగు కిలోమీటర్ల మేర శిధిలావస్థకు చేరుకున్న రోడ్డుపై పాదయాత్ర నిర్వహించి అనంతరం రమణయ్యపేట వద్ద అడ్డంగా గోడ నిర్మించి బైఠాయింపు చేపట్టారు. ఆటోల్లో బస్సుల్లో ప్రయాణికులు సైతం దిగి ఆందోళనలో పాల్గొన్నారు. మూడు కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకుని ఆందోళన విరమించవలసిందిగా కోరినా...రోడ్ల నిర్మాణం ఎప్పుడు చేపడతారు, రాతపూర్వకంగా అధికారులు తెలిపే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ప్రయాణికులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని బ్రతిమలాడటంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు జనసైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో మేము సిద్ధం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ పిఏసి సభ్యులు, కాకినాడ్ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో 27వ డివిజన్ దూదిమిల్లు ప్రాంతంలో వాసంసెట్టి శ్రీను ఆధ్వర్యంలో గ్రీన్ టాక్స్ పేరుతో దారుణ దోపిడీ చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని తరిమి వెయ్యడానికి మేము సిద్ధం అంటూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాశిరెడ్డి శివ మాట్లాడుతూ సిద్ధం పేరుతో అధికార దుర్వినియోగం చేసి సభలను నిర్వహించడం తప్ప మరేమీ జగన్మోహన్ రెడ్డి సభలలో ప్రత్యేకత కనపడటంలేదన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, సాధనాల లోవరాజు, వెంకటరమణ, పంతాడి రాంకుమార్, కిషోర్, జానీ, రామారావు, జీవంకుమార్, ఆనంద్‌కుమార్, కామిరెడ్డి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డిదారిలో ప్రవేశ పెడుతున్న అప్రెంటీస్ విధానానికి ఖండన

విశాలాంధ్ర - కొవ్వూరు : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం ఆదివారం కొవ్వూరు లోని హెలీ ఏంజెల్స్ హై స్కూల్లో జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎపిటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి ఏ సల్మాన్ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు వెట్టి చాకిరీకి గురి చేసే విధానాన్ని పోరాడి రద్దు చేయించుకున్నారని, తిరిగి నేడు గౌరవ వేతనం పేరుతో తిరిగి ప్రవేశ పెట్టాలనే విధానాన్ని వ్యతిరేకించాలని, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకొనే ప్రభుత్వం విద్యార్థులకు మేలు చేకూర్చేలా ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిని అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వవసలసిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలను సంరక్షించుకోవడం కోసం నేడు పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశాకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీటీఎఫ్ ఉమ్మడి ప.గో.జిల్లా మాజీ అధ్యక్షులు కె ఎస్ జవహర్ మాట్లాడుతూ 117 జీ ఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు..మా ప్రభుత్వం వస్తే 117 జీ ఓ ను రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని అన్నారు. సి పి ఎస్ ను వారంలో రద్దు చేస్తామని అన్న నాయకులు ఏమి చేశారో గమనించాలని అన్నారు. జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు మాట్లాడుతూ డి ఎ లు చెల్లించాలని, పెండింగ్ డి ఏ లు విడుదల చేయాలని, 11వ పి ఆర్ సి బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సువర్ణ రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు జి పి ఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా దున్నా దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా పి. సువర్ణ రాజు ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా పి. గంగరాజు, ఎం. వెంకటరావు, ఎ. పద్మలత, బి సూర్యనారాయణ, కార్యదర్శులుగా ఎస్ రాజ శేఖర్, కె వి రాఘవులు, వి అనిత జ్యోతి, పి వి కృష్ణ మోహన్, బి రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ గా సలీం ఎన్నుకోబడ్డారు. ఎన్నుకోబడిన నూతన కార్యవర్గం చేత సాల్మన్ రాజు ప్రమాణం చేయించారు.

గ్లాసు వదిలి ఫ్యాన్ చెంతకు

విశాలాంధ్ర - రాజానగరం : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలో రాజకీయాలు పూటకో రంగు పులుముకుంటున్నాయి. మండలంలోని సూర్యారావుపేటకు చెందిన జనసేన పార్టీ ఎంపీటీసీ సభ్యులు వల్లభశెట్టి వెంకటరమణ(డబ్బు) పార్టీకి రాజీనామా చేసి ఆదివారం వైసీపీలో చేరారు. వెంకట రమణ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగ రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాయపరెడ్డి చిన్న,వైసీపీ నాయకులతో స్థానిక పార్టీ కార్యాలయం నుండి నరేంద్రపురం కూడలి వరకు ర్యాలీగా చేరుకొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, ఎంపీపీ మందారపు సీతరత్నం వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పుల్లంరాజు వర్మ, అనుచరులు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రం ర్యాలీ గ్రామానికి చెందిన ప్రముఖ నాయకులు పేర్చేర్ల నరసింహరాజు మనవడు పేర్చేర్ల పుల్లంరాజు వర్మ వైసీపీకి రాజీనామా చేసి తన అనుచరులు 400 మందితో కలసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గంటి హరీష్ మాధూర్, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు), రాష్ట్ర తెలుగురైతు ప్రధానకార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

అమలాపురంలో 92వ రోజు మహాసంకల్ప యాత్ర

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో 92వ రోజు మహా సంకల్ప యాత్రను నిర్వహించారు.

రాజబాబు పట్టణంలో ప్రతి కుటుంబానికి వెళ్లి కర పత్రాన్ని అందించి జనసేన పార్టీ సిద్ధాంతాలను పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలకు వివరించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పట్టణంలో సమస్యలు ఎప్పటికీ పరిష్కారం అవ్వటం లేదని పలువురు రాజబాబుకి వివరించారు. ఈ కార్యక్రమంలో సుధా చిన్న, ఆకుల బుజ్జి, కంపట్ల వెంకట రమేష్, మహా దశ నాగేశ్వరరావు, చిక్కాల సతీష్, సందడి శ్రీనుబాబు, చిక్కం సూర్య మోహన్, ముత్తబత్తుల శ్రీను, లంకె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర - గండేపల్లి : రాష్ట్రాభివృద్ధి కావాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని జగ్గంపేట వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జి తోట నరసింహ అన్నారు.

గండేపల్లి మండలం జెడ్ రాగం పేటలో పాలచర్ల వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జడ్ రాగం పేటలో అనేక అభివృద్ధి పనులు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యువ నాయకులు తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, ఒబిన్ని సత్యనారాయణ, గుళ్ళా ఏడుకొండలు, మద్దిపట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం పవన్-పవన్ కోసం మనం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ నియోజకవర్గం రూరల్ మండలం సూర్యారావు పేట గ్రామం లైట్ హౌస్ ప్రాంతంలో జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా సూర్యారావు పేట లైట్ హౌస్ ప్రాంత జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికి పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు జనసేన పార్టీ పిఎసి సభ్యులు, కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీ, తెలుగుదేశం నాయకులు సీతయ్యదొర, ఎజ్జల బాబ్జి. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులు వారికి విన్నవించారు. డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదని పంచాయతీ సిబ్బంది కాలువలు శుభ్రం చేయడం లేదని, మంచినీటి సమస్య అధికంగా ఉందని, త్రాగునీటికోసం ప్రభుత్వం నిర్వహించే వాటర్ ప్లాంట్ వినియోగం లేదని, ఎడిబి రోడ్ నుండీ పోర్టుకి వెళ్లే భారీ వాహనాల వల్ల రోడ్లు పాడయి పోయి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ప్రతీ సంవత్సరం ధర్నాలు చేస్తే గానీ జీతాలు పెరగడం లేదన్నారు. మత్స్య కారులకి వేట సామాగ్రికి, పనులు చేసుకోవడానికి భవనం నిర్మించాలని, ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి కాళీ చేయించి పట్టాలు ఇవ్వకుండా రోడ్డున పడ వేశారని, పరిశ్రమ వ్యర్థలవల్ల అనేక ఆరోగ్య సమస్యలు, అర్హులకు పట్టాలు, పింఛన్లు ఇవ్వలేదని ఇలా అనేక సమస్యలు తెలిపారు. త్వరలోనే జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రాబోతోందని మీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు సింహాద్రి, శోభనబాబు, ఎల్లబోయిన రామకృష్ణ, గరికిన సురేష్, సోదే ముసలయ్య, మల్లె భాస్కర్, సురడా శ్రీను, తదితరులు, జనసేన యువత మరియు తెలుగుదేశం నాయకులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

నేడు యథాతథంగా స్పందన

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ :ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం ఫిబ్రవరి 5 వ తేదీ సోమవారం యధావిధిగా స్పందన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, అదేవిధంగా డివిజన్ స్థాయి లో ఆర్డీవో, మునిసిపల్ స్థాయి లో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాలలో స్పందన ఫిర్యాదులు అంద చేయాలని కలెక్టర్ తెలియచేశారు. మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరించాలన్నారు.

జగన్ వైఫల్యాలను ఎండగడట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం నియోజకవర్గం పట్టణంలోని 18,19 వార్డులలో నాయకులు మాగాపు ప్రసాద్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన జండా స్థూపాలను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ జెండా స్తూపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మేమూ సిద్ధం కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లి జగన్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు కనకరాజు సూరి, ఉంగుటూరు నియోజకవర్గం ఇంచార్జ్ ధర్మరాజు,పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు భాష, పోతుల శ్యామ్, ఎర్రంశెట్టి రాజేష్, కూచంపూడి వాసు , సిరిగినీడి హేమంత్ ,కాజా మొహిద్దీన్, ఎస్.కె.భాషా, భాషా, అలీషా, రఫీ, ఆకుల మావుళ్లు, సంకు మవుళ్లు, సుంకర నరేష్, జన సైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కవిటంలో 11నుండి అతిరుద్ర మహాయాగం

విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని కవిటం గ్రామంలో ఈ నెల 11 నుండి 24 వరకు అతిరుద్ర మహాయాగం నిర్వహిస్తున్నామని ఈ మహా యాగం కార్యక్రమాలలో కవిటం పరిసర గ్రామాల భక్తులు పాల్గొనాలని సేవ్ టెంపుల్స్ భారత్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ కోరారు. పెనుమంట్ర మండలం నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ , శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో అతిరుద్ర మహాయోగ మహోత్సవాలను నిర్వహించటానికి . కవిటం వంతెన సెంటర్ సమీపంలో పాలకొల్లు- మార్టేరు రహదారి పక్కనే సువిశాలమైన ప్రదేశంలో యాగశాలను నిర్మించి గత కొద్దిరోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సేవ్ టెంపుల్స్ భారత్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ ఆదివారం యాగ మహోత్సవాలు నిర్వహించే ప్రాంగణాన్ని ఆదివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మేడపాటి తమ్మిరెడ్డి, బిజెపి నాయకులు గుడిమెట్ల రామ కనకారెడ్డి ,సత్తి రామచంద్రారెడ్డి, కర్రి రామిరెడ్డిలతో మాట్లాడారు. యాగ మహోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు. అనంతరం గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం కవిటం గ్రామంలో అతి రుద్రమాహాయాగం నిర్వహించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులంతా మహోత్సవంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ మీడియంలో చేరగోరు విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.చంద్రశారద ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో చేరే ఎస్సీ, ఎస్టీ విద్యార్థినిలు 1-9-2011 నుండి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఓసి, బిసి విద్యార్థినిలు 1-9-2013 నుండి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. అభ్యర్థులు తూర్పుగోదావరి జిల్లాలో ఏదైనా ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేసి కుటుంబ ఆదాయం లక్ష రూపాయలు కంటే తక్కువ ఉన్న వారు అర్హులని అన్నారు. ఇంటర్మీడియట్లో ప్రవేశం పొందగోరు విద్యార్థినులు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో ఆన్లైన్ సెంటర్లో https//bragcet.apcfss.in. వెబ్ సైట్‌కు లాగిన్ అయి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో చేరగోరు విద్యార్థినులకు మార్చి10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు, ఇంటర్మీడియట్‌లో చేరగోరు విద్యార్థినిలకు అదేరోజు ఉదయం 10 నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మాజీ కేంద్రమంత్రి సిడబ్ల్యుసి మెంబర్ ఎంఎం పల్లం రాజు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఇంటింటా కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, రాష్ట్ర కిసాన్ సెల్ కోఆర్డినేటర్ ఉమ్మిడి వెంకటరావు, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, వాకపల్లి,

పోతులూరు తదితర గ్రామాల్లో ఇంటింట కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ , ఈ నెల 9వ తేదీన కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా తునిలో నిర్వహిస్తున్న రోడ్ షోకి ప్రతి ఒక్కరు పాల్గొని ఈ రోడ్ షో కార్యక్రమం జయప్రదం చేయాలని వెంకటరావు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోయేటి సూర్య ప్రకాష్ రావు, కొల్లు వీర గణేష్, కొప్పన కోటేశ్వరరావు, ఎనుమల రాజా, దిడ్డి రాజబాబు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర- నందిగామ: కరువు మిచాంగ్ తుఫాన్ వల్లతుఫాను వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు మల్నిడి యల మందరావు, చుండూరు సుబ్బారావు కోరారు.

రైతు పేట సి ఆర్ భవన్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం కరువు తుఫాన్లతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని రైతులకు కౌలు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ ఈనెల 8 తేదీన కలెక్టర్, ఆర్ డి ఓ, కార్యాలయా ల వద్ద ఆందోళన కార్యక్రమాలు వినతి పత్రాలు ఇవ్వాలని వారు తెలియ జేశారు. ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల 45 వేల రూపాయల అప్పుల భారం ఉన్నందువల్ల కనీసం రెండు లక్షల వరకు పంట రుణాలు రద్దు చేయాలని తెలంగాణ తరహాలో ఎకరాకు 15 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించాలని ఈనెల 8 తేదీన జరగబోయే ఈ కార్యక్రమానికి రైతులు రైతాంగ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు పొల్లేడి నాగభూషణం, నందిగామ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి మన్నే హనుమంతరావు, వేముల వీరయ్య, సిపిఐ సీనియర్ నాయకులు బలసపాటి రాంబాబు, పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర -గన్నవరం : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అందరూ భాగస్వామ్యం కావాలని గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిప్పాడ చంద్ర శేఖరరావు పిలుపు నిచ్చారు. క్యాన్సర్ నిర్మూ లనా దినోత్సవం సందర్భంగా ఆదివారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం మరియు ప్రధాన వీధులలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి కొత్త ప్రపంచం మనం చూడాలంటే ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. క్యాన్సర్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ సమాజంలో నివసించే వ్యక్తుల అలవాట్లను బట్టి ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి విక్టర్ బాబు, వాకర్స్ అసోసియేషన్ స్థాపిత నాయకులు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత శక్తితో సామాజికాభివృద్ధి సాధించండి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విద్యార్థులు సంఘటిత శక్తితో సామాజికాభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని వక్తలు సూచించారు. విస్సన్నపేట కోపా(కాపు అఫీషియల్స్ ఎయిడ్ ఫర్ పూర్), గుంటూరుకు చెందిన కృష్ణదేవరాయ పేద బలహీనవర్గాల సహాయనిధి ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వికాస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ, విద్యార్థులు సామాజిక దృక్పథం కలిగిన విద్యను అందిపుచ్చుకోవాలన్నారు. సానుకూల దృక్పదంతో అపజయాల నుంచి విజయాల దిశగా పయనించాలన్నారు. విద్యాభివృద్ధి ద్వారా సమాజంలో ఉన్నత స్థానాలు సాధించేందుకు ఆస్కారం ఉందని గుర్తించాలన్నారు. కోపా వ్యవస్థాపక అధ్యక్షుడు డా.బండి గోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తులసి సీడ్స్ అధినేత తులసీ రామచంద్రప్రభు, ప్రముఖ విద్యావేత్త లక్కినేని ప్రసాద్, జెన్‌కో రిటైర్డ్ డీఈఈ చందన రామ్మోహనరావు పాల్గొన్నారు. అనంతరం కోపా సభ్యులు వీరిని ఘనంగా సన్మానించారు. కోపా కార్యదర్శి ఎరుబండి వెంకట కృష్ణారావు, కోశాధికారి తుంగల నరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి నిమ్మల గాంధీ తదితరులు పాల్గొన్నారు. సుమారు 300మంది విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు.

భవననిర్మాణ కార్మికసంఘం ఎన్నిక

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట భవన నిర్మాణ కార్మికసంఘం ఎన్నికను సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షునిగా మర్రిబోయిన అప్పారావు, కార్యదర్శిగా పోతురాజు శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పోతురాజు సత్యనారాయణ, ఆకుల శోభన్‌బాబు, సహాయ కార్యదర్శిగా బి.శివ సుబ్బారావు, కోశాధికారిగా ఎం.మంగపతిరావు, గౌరవాధ్యక్షులుగా గంజినబోయిన రాము, గంధం సుబ్బారావు, ఆకుల శ్రీనివాసరావు, సగ్గుర్తి శ్రీనివాసరావులను, రాజేష్, మురళీకృష్ణలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సిఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు ఈ ఎన్నికలు నిర్వహించగా, ముఖ్య అతిథులుగా వ్యకాసం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, కేవీపిఎస్ నాయకుడు ఎం.జ్ఞానరత్నం హాజరయ్యారు.

సిద్ధం అంటూ పోటాపోటీ ఫ్లెక్సీలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో సిద్ధం అంటూ వైసీపీ, జనసేన పార్టీలు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. తొలుత శు

క్రవారం రాత్రి వైసీపీ నేతలు స్థానిక మండలపరిషత్తు కార్యాలయం వద్ద సీఎం జగన్‌తో కూడిన సిద్ధం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ పక్కనే జనసేన నాయకులు శనివారం రాత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం సంసిద్ధం అంటూ పవన్‌కల్యాణ్, చంద్రబాబు చిత్రాలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

జగన్‌కు మరో అవకాశం ఇవ్వండి

విశాలాంధ్ర- పెడన: వైయస్ జగన్మోహన్ రెడ్డి కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరొక అవకాశం కల్పించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ ఇంచార్జ్, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము విజ్ఞప్తి చేశారు. పెడన మండలం నడుపూరు గ్రామపంచాయతీలో ఆదివారం ఉప్పాల రాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నడుపూరు గ్రామంలోని గ్రామ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద మధ్యతరగతి సామాన్య వర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జన రంజక పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన హయంలో ముఖ్యంగా పేద మధ్య తరగతి వర్గ ప్రజలు ఆర్థికంగా బలోపేతం అయ్యారని పేర్కొన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని తెలిపారు. ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి పెడన ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, పెడన మండల ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి. అచ్యుతరావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికపాటి చారుమతి రామానాయుడు, వైస్ ఎంపీపీలు యాదం రెడ్డి వరప్రసాద్, పరసవాకాలమ్మ, వైసిపి మున్సిపల్ కౌన్సిల్ పక్ష నాయకులు బళ్ల గంగయ్య, పెడన పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు మతిన్ ఖాన్, బెజవాడ నాగబాబు, మున్సిపల్ కౌన్సిలర్ మెట్ల గోపి, వైయస్ఆర్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోయ ఆంజనేయులు, పార్టీ ప్రధాన కార్యదర్శి పామర్తి సాంబశివరావు, ఎంపీటీసీలు అంకెం గిరిబాబు, బొల్లా ఉదయ్ కుమార్, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

డిటిఎఫ్ రజతోత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- పెదపారుపూడి : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభలు ఈ నెల 10, 11 తేదీలలో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య క్యాంపస్ సెమినార్ హాలు-2లో డిటిఎఫ్ రజితోత్సవ సభలు 25 ఏళ్ళు నిండిన సందర్భంగా జరుగుతున్నందున ఎక్కువమంది పాల్గొని జయప్రదం చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ళ వరుణ కుమార్ ఒక ప్రకటనలో ఆదివారం ఆ సంఘ సభ్యులను కోరారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే నరహరి, ఎన్ వి రమణయ్య, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పి కృష్ణయ్య,లు పాల్గొంటారని ఆయన అన్నారు. మొదటి రోజు విద్యారంగ సమస్య, విద్యార్థి ఉపాధ్యాయ జెమిని ఉద్యమాల అవశ్యకత అనే అంశంపై ప్రొఫెసర్ జి హరి గోపాల్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, మాతృభాష మాధ్యమం హార్దిక స్థితిగతులు అనే అంశంపై ప్రొఫెసర్ గార్లపాటి ఉమామహేశ్వరరావు నియత విద్య, సహజ విద్య అనే అంశంపై డి చంద్రశేఖర్ టీచర్ బౌద్ధ రచయిత ప్రసంగిస్తారని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కె రాజేంద్రప్రసాద్, కే సాల్మన్ రాజులు ఈ విషయమై అవగాహన కల్పిస్తారని రావెళ్ల ఒక ప్రకటనలో వివరించారు.

టిడిపిలోకి వైసిపి మైనార్టీ, బిసి నాయకులు

విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడ టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము సమక్షంలో ఆదివారం స్థానిక 17వ వార్డుకు చెందిన పలువురు మైనార్టీ, బిసి సంఘాలకు చెందిన నాయకులు. స్థానిక బైపాసు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో 17వ వార్డు వైసిపి, మైనార్టీ, బీసీ సంఘాల నేతలకు టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనపై నమ్మకంతో మద్దతు తెలుపుతున్న ప్రజానీక నమ్మకాన్ని వమ్ముకానీయకుండా పనిచేస్తానన్నారు. 20 ఏళ్లుగా అన్ని రంగాల్లో గుడివాడ వెనుకబడిన ఉందన్నారు. అభివృద్ధి అంటే ఏంటో రాబోవు ఐదేళ్లలో చూపిస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కాల్యాణ్ కూటమికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ, బత్తిన భద్రాచలం, శొంఠి అయ్యప్ప, మద్దుకూరు ప్రభాకర్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లిలో సచివాలయ అనుబంధ భవనాలు ప్రారంభం

విశాలాంధ్ర - గుడివాడ : నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆదివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొడాలి నాని మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు విద్యా, వైద్యం సంపూర్ణంగా అందించాలనే సంకల్పంతో సిఎం జగన్ తీసుకున్న చర్యలు ఎంతో విజయవంతమయ్యా యన్నారు. ఎవరెన్ని అవాంతరాలు సృష్టించిన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నిబద్ధత కలిగిన నాయకుడు జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, సర్పంచ్ రాధాకృష్ణ, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి, తుమ్మలపల్లి ఎంపిటీసీ వెన్నా ప్రభావతి, నాయకులు కొండపల్లి కుమార్‌రెడ్డి, చింతాడ నాగూర్, పాలేటి చంటి, గూడపాటి వెంకటేశ్వరరావు, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ,కందుల నాగరాజు, అమృతబాబు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయవాడ రత్న మరుపిళ్ల చిట్టి

కాంస్య విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర -విజయవాడ(చిట్టినగర్): భారతరత్న మాదిరిగా విజయవాడ రత్న సర్దార్ మరుపిళ్ళ చిట్టి అని ఎంపీ కేశినేని నాని అన్నారు. కుల ప్రాంతీయ లకు అతీతంగా రాజ్యాంగ పరిరక్షణతో 1952 లో శాసనసభ్యునిగా ఎన్నికై అవిరళ కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ నగరాల ఐక్యవేదిక, విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో చిట్టినగర్ సెంటర్ వద్ద ఏపీ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాయన బాబ్జి, పోతిన వెంకటస్వామి వీరిద్దరి అధ్యక్షతన మరుపిళ్ల చిట్టి కాంస్య విగ్రహావిష్కరణ సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కేశినేని శ్రీనివాసరావు(నాని), పశ్చిమ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ వైయస్సార్సీపి పశ్చిమ ఇంచార్జ్ ఎండి ఆసిఫ్, బిజెపి నాయకులు అడ్డూరి శ్రీరామ్, భోగవల్లి శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ, పోరాటంలో కుటుంబాన్ని సైతం ఉద్యమ బాట నిలిపిన వాళ్లలో ఒకరని కొనియాడారు. నగరాల కులంలో ఆరాధ్య దైవంగా భావించే పెద్దలూ, మాజీ ఎమ్మెల్యే , ఆంధ్రజ్యోతి బిరుదు అందుకున్న, స్వాతంత్ర సమరయోధులు, విజయవాడ ప్రజల కోసం మిల్క్ ఫ్యాక్టరీ కొరకు భూమిని దానం చేసిన మహనీయులు, సర్దార్. మరుపిళ్ళ చిట్టి అని కొనియాడారు.

విగ్రహం ఆవిష్కరణ అనంతరం జనసేన వర్సెస్ వైయస్సార్సీపి ఆదర్శ ఆధిపత్యంతో సభా ప్రాంగణమంతా బాణాసంచా జగన్ పవన్ నినాదాలతో అధ్యంతం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పోతిన స్వామి, పోతిన పైడి రావు, పోతిన వెంకటేశ్వర స్వామి, బాయన వెంకట్రావు, చిట్టి పెద్ద కుమార్తె మరుపిళ్ల ఉమా మోహన తిలక్, నాగ పావని, పిళ్ళా మోహన్ రావు, వైవి రావు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలంలో పలు గ్రామాలలో జరుగు తున్న నవరత్నాలు పేదలందరికీ ఇండ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి పి.సాయి బాబు ఆదివారం తనిఖీ చేశారు. పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో జగనన్న కాలనీలలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులందరికీ గత రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభ మైంది.

పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ రిజిస్ట్రార్ హోదా ఇవ్వడం తో,ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి, విఆర్వోలు కలిసి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ ప్రారంభించి పట్టాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా వేములపల్లి, మొగులూరు గ్రామలను నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి పి.సాయిబాబు నవరత్నాలు పేదలందరి కీ ఇండ్లను గ్రామ సచివాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయి ప్రక్రియను ఆదివారం కూడా జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. కంచికచర్ల డిప్యూటీ తాహసిల్దారు నాగుల్ మీరా ఆర్డీవో వెంట పాల్గొన్నారు.

జనసేన స్తూపం కూల్చివేత హేయం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయము లేకుండా ప్రైవేట్ స్థలంలో కట్టిన జనసేన జెండాదిమ్మను కూల్చివేయటం హేయమైన చర్య అని మచిలీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణ అన్నారు శుక్రవారం భాస్కరపురం లో ప్రైవేట్ స్థలంలో కట్టిన జండా దిమ్మను కూల్చివేయదానికి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రయత్నించగా దానిని అడ్డుకున్నామని, దీనిపై కక్ష కట్టిన అసాంఘిక శక్తులు అర్ధరాత్రి ప్రొక్లైనర్ తో కూల్చివేయడం నీతిమాలిన చర్య అని, దమ్ముంటే ధైర్యంగా ఎదుర్కోవాలి కానీ దొంగ దెబ్బ తీయడం వారి పతనానికి పరాకాష్ట అని అన్నారు. ఈ విషయంపై ఆదివారం మచిలీపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ ఇంతకుముందు రాజకీయాలు హుందాగా ఉండేవని ఈ ప్రభుత్వంలో దిగజారుడుతనం ఎక్కువైందని సిసి ఫుటేజ్ ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ జనసేన ఇంచార్జ్ కరుణాకర్, జనసేన నాయకులు గద్దం రాజు, కొట్టే వెంకటరావు, పీవీ ఫణి కుమార్, జనసేన, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.